# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 24, జూన్ 2026


# బాసర క్షేత్రంలో చోరీ..

● ఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రామారావు పటేల్



**భైంసా, జూన్ 22, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ప్రధాన ఆలయం వెనుక ఉన్న మహంకాళి ఉప ఆలయం తాళాలు పగులగొట్టి దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ సోమవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆలయ, పోలీసు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, దొంగతనం చేసిన వారిని త్వరగా పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) అవగాహనలో భాగంగా బాసర మండల కేంద్రంలో నిర్వహించిన 2కే రన్‌లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ పాల్గొన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ పరుగును నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, పోలీసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఔట్‌సోర్సింగ్ వేతనాలు..

# సకాలంలో చెల్లించాలి

**పల్స్ పోలియోను విజయవంతం చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, జూన్ 23, ప్రభాతవార్త:**



జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రతి నెల సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. వేతనాల చెల్లింపులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, శాఖల వారీ వివరాలపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుండి నిధులు విడుదల కాగానే ఆలస్యం చేయకుండా ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ నిధులను సకాలంలో చెల్లించాలని స్పష్టం చేశారు. అనుమతి పొందిన పోస్టులను నిబంధనల ప్రకారం అత్యంత పారదర్శకంగా భర్తీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) రాథోడ్ రమేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ నెల 28న పల్స్ పోలియో కార్యక్రమం అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 28న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే పల్స్ మిగతా 2లో..

# పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి



**చెన్నూర్, జూన్ 23, ప్రభాతవార్త**

జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం లింగన్నపేట, ఏదుల బంధం, సిర్స, రొయ్యలపల్లి, ఆల్గాం, వెంచపల్లి గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ రెడ్డి లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాలలో సి.సి. రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున మిగతా 2లో..




# దుర్గామాత ఆలయం వద్ద గుప్త నిధుల వేట..

**అక్రమ తవ్వకాలు చేస్తున్న ఇద్దరిని పట్టుకున్న పోలీసులు.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**

**మంచిర్యాల, జూన్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ క్వారీ సమీపంలో ఉన్న దుర్గామాత ఆలయం వద్ద గుప్తనిధుల కోసం అక్రమంగా తవ్వకాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఆలయ పరిసర ప్రాంతంలో అనుమానాస్పదంగా తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి మిగతా 2లో..

# ఫారెస్ట్ కార్యాలయం ఎదుట పోడు రైతుల ధర్నా

❒ మా భూములు మాకే కావాలి.. మేము చనిపోయినా సరే మా భూమిలోనే చస్తాం...

❒ ఫారెస్ట్ అధికారులపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 23, ప్రభాతవార్త**

మా భూములు మాకే కావాలి...మేము చనిపోయినా సరే మా భూమిలోనే చస్తాం అంటూ పోడు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోడు భూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట పోడు రైతులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా కేంద్రానికి చేరుకొని రైతులకు సంఘీభావం తెలిపారు. ధర్నాలో పాల్గొని రైతులతో కలిసి మేము రైతులం, దేశానికే అన్నం పెట్టే రైతులం, మా భూములను లాక్కోవడం కంటే మమ్మల్ని అందరిని ఇక్కడే చెట్లకి ఉరి తీయండి అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోడు భూముల సమస్యను గుర్తించి లక్షలాది ఎకరాలకు పట్టాలు ఇచ్చారని, కేసీఆర్ రైతులను కడుపులో పెట్టుకొని చూసుకున్నారని, రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలతో రైతుకు అండగా నిలిచారని పేర్కొన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న గిరిజన, ఆదివాసీ రైతులకు అన్యాయం జరగనివ్వనని రైతులకు భరోసా కల్పించారు. సర్వే పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని, విత్తనాలు వేసుకునే సీజన్‌లో ఆటంకాలు కలిగించవద్దని అటవీ శాఖ అధికారులకు సూచించారు. రైతుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాడుతానని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వందలాది మంది పోడు రైతులు పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ వేతనాలు..
# సకాలంలో చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

పోలియో కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పేర్కొన్నారు. ప్రధాన రోజున చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి, ఆ తర్వాత రెండు రోజుల పాటు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. అలాగే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్యులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) రాజేందర్, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గామాత ఆలయం వద్ద గుప్త నిధుల వేట..

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నారు. పట్టుబడిన వారు కొమరం పవన్ కళ్యాణ్ 26 జాడి బద్దిరాజు 42 గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో ఆలయ ప్రాంగణంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ వెల్లడించారు. ఆలయాల వంటి పవిత్ర ప్రదేశాల్లో అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## గల్ఫ్‌లో మరణించిన కార్మికుడి కుటుంబానికి ఎన్నారై కమిటీ సభ్యుడి భరోసా

సారంగాపూర్, జూన్ 23, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలం వైకుంఠాపూర్ గ్రామానికి చెందిన లగ్గం జగదీశ్ (38) గల్ఫ్‌లో మరణించడంతో తీవ్ర శోకసంద్రంలో మునిగిన ఆయన కుటుంబాన్ని ఎన్నారై సలహా కమిటీ రాష్ట్ర సభ్యులు స్వదేశీ పరికిపండ్ల మంగళవారం పరామర్శించారు. జగదీశ్ ఉపాధి కోసం కొద్దిరోజుల క్రితమే దుబాయ్ వెళ్లి, అక్కడ ఒక అరబిక్ కోళ్లఫారంలో లేబర్‌గా చేరారు. అయితే, ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన.. స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 18వ తేదీన మృతి చెందారు. ఈ విషయం తెలిసి వైకుంఠాపూర్‌లోని జగదీశ్ నివాసానికి వెళ్లిన స్వదేశీ పరికిపండ్ల.. మృతుడి భార్య, పిల్లలను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. భౌతికకాయాన్ని ఇండియాకు పంపించడానికి దాదాపు 3 లక్షల రూపాయల ఖర్చవుతుందని, అక్కడి కంపెనీ యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కవిత కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై స్వదేశీ పరికిపండ్ల సానుకూలంగా స్పందిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా దుబాయ్ ఎంబసీతో మాట్లాడి జగదీశ్ భౌతికకాయాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పిస్తామని, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రొడ్డ మారుతి, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ నాయకులు రమేష్, సదా అమృత్, గ్రామస్థులు దేవేందర్, చిన్నయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వం సూచించిన వరి ధాన్యం పంటలు మాత్రమే సాగు చేయండి

**- ఏడు రకాల వరి ధాన్యం పంటలకు మాత్రమే బోనస్**

**- చెన్నూరు మండల వ్యవసాయ శాఖ అధికారి యామిని**

చెన్నూరు, జూన్ 23, ప్రభాతవార్త

ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి ధాన్యం పంటలకు మాత్రమే 500 రూపాయల బోనస్ వస్తుందని, ప్రభుత్వం సూచించిన పంటలు మాత్రమే పండించాలని చెన్నూరు మండల వ్యవసాయాధికారి యామిని అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని శివలింగాపూర్, కిష్టంపేట, అంగరాజుపల్లి రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా క్లస్టర్ల పరిధిలోని విత్తన డీలర్లు రైతు వేదికల్లో స్టాలు ఏర్పాటు చేసి విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఈ విత్తన మేళా ఈనెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయక సంచాలకులు బానోతు ప్రసాద్, పిపిఓ గోపి, ఏఈఓ లు వైష్ణవి, అర్చన, సాయికృష్ణ, వనదేవి, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. లింగన్నపేట గ్రామంలో గతంలో 14 నూతన విద్యుత్ పోల్స్, 4 బోర్ వెల్స్ పనులను దాదాపు 20 లక్షల రూపాయల ఈజీఎస్, ఎస్.డి.ఎఫ్. నిధులతో చేపట్టి ఇప్పుడు 10 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఏదుల బంధంలో 15 లక్షల రూపాయల ఎస్.డి.ఎఫ్., డి.ఎం.ఎఫ్.టి. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని, ఆల్గాం, వెంచపల్లి, జనగాం గ్రామాలలో 10 లక్షల రూపాయల చొప్పున కేటాయించి పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రేషన్ కార్డులు అందించి సన్నబియ్యం అందించడం జరుగుతుందని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 2 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయడం జరుగుతుందని, 200 కోట్ల రూపాయల వ్యయంతో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 100 కోట్ల రూపాయల వ్యయంతో అమృత్ 2.0 పథకం ద్వారా ప్రజలకు త్రాగునీరు అందించేందుకు నీటి ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. 46 కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, వృత్తి విద్య కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయడంతో పాటు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెన్నూర్ లో నీటి వనరుల ఏర్పాటుకు 40 కోట్ల రూపాయలతో ప్రత్యామ్నాయ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య రంగ బలోపేతం దిశగా కృషి చేస్తూ ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, 23 మంది వైద్యులను నియమించి చెన్నూర్ లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామని, మందమర్రి ప్రాంతంలో 50 పడకల ఆసుపత్రి పున: ప్రారంభానికి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. సింగరేణి సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చి 11 వేల కోట్ల రూపాయల లాభాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. ఇసుక మాఫియా నియంత్రణపై కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, సి.సి. కెమెరాలు, వే బ్రిడ్జిల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఆల్గాం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, మూత్రశాలలు, విద్యుత్, ఇతర మరమ్మత్తు పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఖగసే నో టు డ్రగ్స్ ౧౧ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి విక్రయాలపై పోలీసు శాఖ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

సారంగాపూర్, జూన్ 23, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ గ్రామస్థులు, యువతకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. నేటి యువతను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఎస్సై పిలుపునిచ్చారు. యువత ఎలాంటి చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తును బాగుచేసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ సందర్భంగా గోడపత్రాలను (పోస్టర్లు) అంటించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, లింగరావు, గ్రామ ప్రముఖులు, యువకులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల షెడ్ల కూల్చివేత దారుణం.. బాధితులకు న్యాయం చేయాలి

## నష్టపరిహారం చెల్లించి ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని జిల్లా అధికారులకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్

మంచిర్యాల, జూన్ 23, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బస్టాండ్, మార్కెట్ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల షెడ్ల కూల్చివేతపై బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ప్రోత్సాహంతో మున్సిపల్ అధికారులు, పోలీసుల సహకారంతో ఈ కూల్చివేతలు జరిపారని ఆరోపించారు. బాధిత వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విజిత్ కుమార్ మాట్లాడుతూ, మంచిర్యాల నియోజకవర్గంలో ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి అన్యాయ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి కోసం ఓటు వేస్తే, ప్రస్తుతం వారి జీవనోపాధి పైనే దెబ్బ పడుతోందని అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో చిరు వ్యాపారులకు ఇది ఆదాయం వచ్చే ముఖ్యమైన సమయమని, అలాంటి సమయంలో షెడ్లను కూల్చివేయడం బాధాకరమని తెలిపారు. వ్యాపారులు వ్యాపారం కోసం ఒక్కొక్కరు రెండు లక్షల రూపాయల వరకు సరుకులు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో రైల్వే స్టేషన్ సమీపంలోని దుకాణాలను తొలగించే పరిస్థితి వచ్చినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని దుకాణాలను కాపాడారని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం అధికార యంత్రాంగం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దొంగతనాలు, దోపిడీలు జరిగినప్పుడు ఆలస్యంగా స్పందించే పోలీసులు, కూల్చివేతల సమయంలో మాత్రం ముందుండటం విచారకరమని అన్నారు. బాధిత వ్యాపారులకు తక్షణమే ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, ఒక్కొక్కరికి లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ వారి తరఫున పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి నాయకులకు దళిత రత్న అవార్డులు

బెల్లంపల్లి, జూన్ 23, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్ఠాత్మక దళిత రత్న అవార్డులు బెల్లంపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు బత్తుల రాజలింగం మరియు కారంగుల మల్లేష్‌కు లభించడంతో పట్టణంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దళిత హక్కుల పరిరక్షణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాసేవా రంగాల్లో వారు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రకటించింది. ఈ సందర్భంగా బెల్లంపల్లిలోని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కార్యాలయంలో అవార్డు గ్రహీతలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గం చిన్నయ్య వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. వారి సేవలు బెల్లంపల్లి ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజ సేవ పట్ల వారి అంకితభావం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర స్థాయి దళిత రత్న అవార్డులు బెల్లంపల్లికి రావడం పట్టణ ప్రజలకు గర్వకారణమని స్థానికులు పేర్కొంటూ, బత్తుల రాజలింగం మరియు కారంగుల మల్లేష్‌ల సేవలకు లభించిన ఈ గుర్తింపును హర్షిస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

# జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం - జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

### పల్స్ పోలియో, మాతాశిశు సంరక్షణ, అత్యవసర మందుల నిల్వలు, దోమల ద్వారా వ్యాధుల నియంత్రణపై అధికారులకు కీలక ఆదేశాలు

**మంచిర్యాల, జూన్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి, వైద్య సిబ్బందికి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. అలాగే అత్యవసర మందుల నిల్వలు, అసంక్రమణ వ్యాధుల నమోదు ప్రక్రియను పరిశీలించి, పోర్టల్‌లో వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు రోగులకు సమయానికి పరీక్షలు, మందులు అందేలా చూడాలని ఆదేశించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షల కోసం వేగవంత నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే పాము కాటు, తేలు కాటు, కుక్క కాటు వంటి అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు, టీకాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణుల నమోదు వివరాలను పరిశీలించిన జిల్లా వైద్యాధికారి, అధిక ప్రమాద గర్భిణులపై వైద్యాధికారి రోజువారీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణపై ఫార్మసిస్టుకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. ప్రభావిత గ్రామాలు, ఆరోగ్య కేంద్రాల్లో ద్రవ లోప నివారణ ద్రావణం అందుబాటులో ఉంచాలని తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్ధవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. మండల అభివృద్ధి అధికారి, మండల రెవెన్యూ అధికారి, విద్యాశాఖ అధికారులు, వైద్యాధికారులు కలిసి మండల కమిటీల ద్వారా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేగవంత స్పందన బృందాలు ఏర్పాటు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి, ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లల వివరాలను నమోదు చేసి, టీకా క్యారియర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ముస్తాఫా, జిల్లా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిహెచ్ఓ రాజిరెడ్డి, నర్సింగ్ అధికారులు, వైద్య సిబ్బంది వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యాధికారి

## విత్తన మేళాలతో రైతులకు బంగారు అవకాశం

**బెల్లంపల్లి, జూన్ 23, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు వేదికలలో విత్తన మేళా కార్యక్రమంలో భాగంగా కన్నాల రైతు వేదికలో విత్తన మేళాను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విత్తన స్టాళ్లను ఆయన సందర్శించి, డీలర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ విత్తన మేళా కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీ వరకు అన్ని రైతు వేదికలలో నిర్వహిస్తోందని తెలిపారు. ముఖ్యంగా వరిలో డిమాండ్ ఉన్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేసి సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న విత్తనాలను అన్ని రైతు వేదికల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, వ్యవసాయ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు వివిధ విత్తన రకాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సబ్సిడీ కంది విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నాల సర్పంచ్ నేతరి మల్లమ్మ, ఉప సర్పంచ్ తోకల సూరమ్మ, చంద్రవెల్లి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ చింత స్వామి, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజా నరేందర్, వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్, ఉద్యానవన అధికారి అర్చన, వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని డీలర్లు, రైతులు హాజరయ్యారు. ఇదే సందర్భంగా గురజాల రైతు వేదికలో కూడా విత్తన మేళాను ఏఈఓ గౌసియ బేగం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## దేశ సమైక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ

### - కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి వ్యతిరేకంగా పోరాడి బలిదానం చేసిన జాతీయవాది

### - జూన్ 23న బలిదాన్ దివస్‌గా నివాళులు

**మంచిర్యాల, జూన్ 23, ప్రభాతవార్త**

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని భారతీయ జనతా పార్టీ తెలంగాణ మీడియా ప్యానలిస్టు తుల ఆంజనేయులు పేర్కొన్నారు. జూన్ 23 1953న ఆయన కాశ్మీర్‌లో పోలీసు కస్టడీలో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారని గుర్తుచేశారు. ప్రతి సంవత్సరం జూన్ 23 న ఆయన వర్ధంతిని బలిదాన్ దివస్‌గా దేశవ్యాప్తంగా నిర్వహిస్తారని తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370ను డాక్టర్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఖఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు" అనే సిద్ధాంతంతో ఆయన ప్రజల్లో చైతన్యం కల్పించారు. అప్పట్లో కాశ్మీర్‌లో ప్రవేశించాలంటే భారత పౌరులకు కూడా ప్రత్యేక అనుమతి పత్రం అవసరమయ్యేది. ఈ పర్మిట్ విధానాన్ని నిరసిస్తూ 1953 మే 11న ఆయన అనుమతి లేకుండానే కాశ్మీర్‌లోకి ప్రవేశించగా సరిహద్దులోనే అరెస్టు చేసి శ్రీనగర్ జైలులో నిర్బంధించారు. అనంతరం జూన్ 23న కస్టడీలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. అధికారికంగా గుండెపోటు కారణమని ప్రకటించినప్పటికీ, కుటుంబ సభ్యులు, అనుచరులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన మరణంపై సమగ్ర విచారణ జరపాలని ఆయన తల్లి జోగ్మాయా దేవి అప్పటి ప్రధాని నెహ్రూను కోరినా ప్రభుత్వం విచారణ చేపట్టకపోవడం పలు సందేహాలకు దారితీసిందన్నారు. డాక్టర్ ముఖర్జీ బలిదానం తర్వాత దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయని, దాని ఫలితంగా కాశ్మీర్ ప్రవేశానికి అవసరమైన పర్మిట్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. దేశ సమైక్యత కోసం ఖఒకే దేశం - ఒకే చట్టం" అనే భావజాలంతో పోరాడి ప్రాణత్యాగం చేసిన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, తులా ఆంజనేయులు తదితరులు నివాళులర్పించారు.



## తోల్లవాగు సమీపంలో నీటిమయం..

### - అంజనీపుత్ర స్థల విక్రయ కేంద్రం ముందు దయనీయ దృశ్యం

### - స్పందించని అధికారులు

**మంచిర్యాల, జూన్ 23, ప్రభాతవార్త**

మంచిర్యాల నగర పురపాలక సంస్థ పరిధిలోని తోల్ల వాగు సమీప వంద అడుగుల రహదారి అంజనీపుత్ర స్థల విక్రయ కేంద్రం ముందు ఒకే ఒక్క వర్షానికే చెరువును తలపించేలా మారింది. స్వల్ప వర్షానికే భారీగా నీరు నిల్వ ఉండటంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై వర్షపు నీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడం, నీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా రహదారి నీటి మయమై ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకే వర్షానికి ఇలాంటి పరిస్థితి ఉంటే రాబోయే భారీ వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం కూడా ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకముందే పురపాలక అధికారులు స్పందించి నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వీడి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## గంగాపూర్ రైతు వేదికలో విత్తన మేళా

### - మార్కెట్ డిమాండ్ ఉన్న ధృవీకరించిన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలి : డీఏఓ వెంకటి

**రెబ్బెన, జూన్ 23, ప్రభాత వార్త:**

మండలంలోని గంగాపూర్ రైతు వేదికలో నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) వెంకటి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ప్రభుత్వం ధృవీకరించిన వరి విత్తన రకాలను మాత్రమే రైతులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సోనా, జై శ్రీరామ్, హెచ్ఎంటీ సోనా, బీపీటీ5204, కెఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44, కెఎన్ఎం7715 వంటి ధృవీకరించిన వరి విత్తనాలను సాగు చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అలాగే రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించి పంటల ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటల మార్పిడికి ప్రాధాన్యంఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంటల మార్పిడి విధానంపై దృష్టి సారించాలని డీఏఓ వెంకటి పేర్కొన్నారు. ముఖ్యంగా కందులు, జొన్నలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా మంచి దిగుబడులు, ఆర్థిక లాభాలు పొందవచ్చని వివరించారు. ఈ సందర్భంగా జూన్ 30, 2026 వరకు నిర్వహించనున్న రైతు మేళాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.

## అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**ఆసిఫాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :**

భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజల సౌకర్యం కోసం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవనంలో కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. వరద పరిస్థితులలో అత్యవసర సేవల నిమిత్తం ప్రజలు కంట్రోల్ రూమ్ నం. 8500844365 లో సంప్రదించవచ్చని తెలిపారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

### - తిర్యాని ఎస్సై సుబ్బారావు

**తిర్యాని, జూన్ 23, ప్రభాతవార్త**

డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని తిర్యాని ఎస్సై సుబ్బారావు అన్నారు. మంగళవారం తిర్యాని మండల కేంద్రంలోని స్థానిక ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుబ్బారావు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, క్రీడలు అలాగే సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థులు చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- గేట్ మీటింగ్‌లపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాం
- కవిత పర్యటనను విజయవంతం చేసిన కార్మికులకు కృతజ్ఞతలు
- సమస్యలు చెప్పుకునే హక్కును కాలరాయవద్దు
- మహిళలను కించపరిచే వ్యాఖ్యలు వివిధ సంఘాల నాయకులు మానుకోవాలి
- కార్మిక సంక్షేమంపై దృష్టి పెట్టాలని యాజమాన్యానికి సూచన
- హెచ్‌ఎంఎస్ మందమరి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి సాజన్



**మందమర్రి, జూన్ 23,ప్రభాతవార్త :**

సింగరేణి కార్మికుల సమస్యలను తెలుసుకోవడానికి, వాటి పరిష్కారం కోసం గేట్ మీటింగ్‌లు అత్యంత అవసరమని, వాటిపై ప్రభుత్వం, పోలీసులు, సింగరేణి యాజమాన్యం ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మంగళవారం మందమర్రి లోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ సాజన్ అన్నారు.కవిత పర్యటనను విజయవంతం చేసిన కార్మికులకు కృతజ్ఞతలుకల్వకుంట్ల కవిత సింగరేణి పర్యటన సందర్భంగా కార్మికులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని సాజన్ పేర్కొన్నారు. కార్మికులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను వెల్లడించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి కార్మికుడికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### గేట్ మీటింగ్‌లను అడ్డుకోవడం సరికాదు..

కార్మికులు తమ సమస్యలను నేరుగా నాయకులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసే ప్రధాన వేదిక గేట్ మీటింగ్‌లేనని అన్నారు. గేట్లకు తాళాలు వేయడం, పోలీసు పహారా ఏర్పాటు చేయడం, విద్యుత్ సరఫరా నిలిపివేయడం వంటి చర్యలు కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను హరించే ప్రయత్నమని విమర్శించారు.ధర్నా చౌక్‌కు ఉన్న ప్రాధాన్యత గేట్ మీటింగ్‌లకూ ఇవ్వాలిప్రజాస్వామ్యంలో ప్రజల గొంతు వినిపించే ప్రతి వేదికకు సమాన ప్రాధాన్యత ఉండాలని సాజన్ పేర్కొన్నారు. ధర్నా చౌక్ ఎంత అవసరమో కార్మిక క్షేత్రాల్లో గేట్ మీటింగ్‌లు కూడా అంతే అవసరమని అన్నారు. కార్మికుల సమస్యలను వినకుండా ఆంక్షలు విధించడం సరైన పద్ధతి కాదన్నారు.

### కార్మికుల సమస్యలపై యాజమాన్యం దృష్టి సారించాలి..

కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యం, నాయకులు మరియు కార్మికుల మధ్య దూరం పెంచే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, బదిలీలు, డిప్యూటేషన్‌లు, వైద్య సేవల లోపాలు వంటి అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మహిళలను కించపరిచే వ్యాఖ్యలు ఖండనీయం..

కొందరు వివిధ సంఘాలకు చెందిన నాయకులు మహిళలను కించపరిచే విధంగా పాటలు, వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని సాజన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు విధానాలపై ఉండాలే తప్ప వ్యక్తిగత దూషణలు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.కార్మికుల హక్కుల కోసం హెచ్‌ఎంఎస్ పోరాటం కొనసాగుతుందిసింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం హెచ్‌ఎంఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని సాజన్ స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.వైద్య సేవలు మెరుగుపర్చాలిసింగరేణి ప్రాంతంలో మెడికల్ బోర్డుల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు.

### కార్మికుల ఐక్యతే విజయానికి బాట..

కార్మికులు ఐక్యంగా ఉంటేనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ భువన చంద్ర, ఏరియా నాయకులు నవీన్, కార్తీక్, హరీష్ కాసిపేట 1 ఫిట్ సెక్రటరీ ప్రిత్పాల్ సింగ్ కాసిపేట 2 ఫిట్ సెక్రటరీ పరుశురాం, శాంతిఖని ఫిట్ సెక్రటరీ లింగాల కిరణ్ మరియు నాయకులు శ్రవణ్, గౌతం, రవితేజ, విజయ్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- డ్రగ్స్, గంజా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత
- గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, జూన్ 23, ప్రభాతవార్త**




మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణ సీఐ బన్సీలాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖగనషా ముక్త్ భారత్ అభియాన్" పోస్టర్లను విడుదల చేసి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. చెన్నూర్‌ను మాదకద్రవ్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ సీఐ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ శాఖ ఏడీఈ, పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంపై కాంగ్రెస్ నేతల అవగాహన సమావేశం

**బెల్లంపల్లి, జూన్ 23, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నేడు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు పాల్గొని బిఎల్ఎలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐఆర్ జూన్ 25 నుండి ప్రారంభమయ్యే కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో కీలకమని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు పొందిన ఓటర్లు అందరూ వాటిలో కోరిన వివరాలను సరిగ్గా నింపి, 2002 నిబంధనల ప్రకారం రెండు ఫోటోలు అతికించి, తమ సంతకం చేసి సంబంధిత బిఎల్ఎ లకు అందజేయాలని తెలిపారు. అనంతరం బిఎల్ఎలు బిఎల్ఓల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారని, అప్పుడే ఓటు చెల్లుబాటు అవుతుందని వివరించారు. చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యుడు చిలుముల శంకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లారపు చిన్న రాజం, మంచిర్యాల జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్, ఎస్ఐఆర్ ట్రైనర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎమ్.డి ఖాజా పాషా, అడ్వకేట్ కనుకుంట్ల రాజేష్, పాముల రాజలింగు, అలాగే ఎండి ఇబ్రహీం, ఎండి షకీల్, ఎండి హిత్యాజ్, ఎండి హిల్వంజ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- బీకేఎంయూ ఆధ్వర్యంలో వినతి

**బెల్లంపల్లి, జూన్ 23, ప్రభాతవార్త**



వ్యవసాయ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీకేఎంయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, జిల్లా కార్యదర్శి గుండా చంద్ర మాణిక్యం మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రతి సంవత్సరం రూ. 2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే వేతనాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న విధానాలను రద్దు చేసి, ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ. 700 వేతనం చెల్లించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా అర్హులైన వ్యవసాయ కార్మికులకు ప్రతి నెల రూ. 6,000 పింఛను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు గుండా శంకర్, రత్నం రాజం తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సమగ్ర సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ రాములు

**నస్పూర్, జూన్ 23, ప్రభాతవార్త:**

జిల్లాలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం (కలెక్టరేట్) లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కీలక కార్యక్రమంలో రాజకీయ పార్టీలు చురుగ్గా భాగస్వాములు కావాలన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయికి వెళ్లి ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారాలను అందిస్తారని, ఆయా ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి సేకరించి వాటి వివరాలను ఎప్పటికప్పుడు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. ఈ ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఎక్కడా తప్పులు దొర్లకుండా రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ కోరారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం నిరంతరం ఈ సవరణ ప్రక్రియను పర్యవేక్షిస్తుందన్నారు. రాజకీయ పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్లను చైతన్యపరిచి ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవం

**సారంగాపూర్, జూన్ 23, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో వెలిసిన సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం గ్రామస్థులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠాపన జరిగి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉదయాన్నే బాబాకు కాకడ హారతి, అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ సమీపంలో భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుండి తరలివచ్చిన వందలాది మంది భక్తులు బాబావారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వేళ సాయిబాబా పల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. బాబా భజనలు, మంగళవాయిద్యాల నడుమ పల్లకిని గ్రామ వీధుల వెంబడి ఊరేగించారు. భక్తులు ఇళ్ల వద్ద బాబాకు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన యువకులు, పెద్దలు కలిసికట్టుగా ఉత్సాహంగా పాల్గొని ఆలయ వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



## డాక్టరేట్ అందుకున్న సుదర్శన్

**- చామన్‌పల్లి ఉపాధ్యాయుల ఘన సన్మానం**

**సారంగాపూర్, జూన్ 23, ప్రభాతవార్త:**

లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త సుదర్శన్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించి డాక్టరేట్ అందుకున్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను ఆదుకోవడానికి ఆయన చేసిన విశేష సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి, ఆసియా ఇంటర్నేషనల్ ట్రూ రీసెర్చ్ అకాడమీ వారు ఆయనకు ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. కాగా, సుదర్శన్ భార్య లక్ష్మి ప్రస్తుతం చామన్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో, చామన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పీహెచ్ఎస్) ఉపాధ్యాయ బృందం మంగళవారం పాఠశాల ఆవరణలో సుదర్శన్‌ను ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన వ్యక్తి అంతర్జాతీయ స్థాయి పురస్కారాన్ని, డాక్టరేట్‌ను అందుకోవడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తాను చేసిన సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని అందించడం సంతోషంగా ఉందని, రాబోయే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలను మరింత ఉధృతంగా కొనసాగిస్తానని సుదర్శన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏ. మాజీద్, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ ప్రొసీడింగ్ కాపీ అందజేసిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**భైంసా, జూన్ 23, ప్రభాతవార్త:**

భైంసా మండల పరిధిలోని పెండిపెల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ మంగళవారం గ్రామస్థులకు అందజేశారు. గ్రామాభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినందుకు పెండిపెల్లి గ్రామ సర్పంచ్ శీను, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.



## విత్తన మేళాలో నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

**- తాండూర్ ఏవో సుష్మ**

**తాండూర్, జూన్ 23, ప్రభాతవార్త**

విత్తన మేళాలో విత్తనాల కంపెనీల డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సుష్మ అన్నారు. కొత్తపల్లి రైతు వేదికలో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ధరలకే విత్తనాలు విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వానాకాలంలో వరి సాగు చేసే రైతులు ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఏడు రకాల వరి ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులకు నానో యూరియా, నానో డిఏపి అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల వెంకటేష్, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

## టీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేశెట్టి సంతోష్ కుమార్

**తాండూర్, జూన్ 23, ప్రభాతవార్త :**



తాండూర్ మండలం ఐబికి చెందిన కేశెట్టి సంతోష్ కుమార్‌ను తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కేశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గౌరవ పరిరక్షణ, ఉద్యమ చరిత్రను భావితరాలకు చేరవేయడం, ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన నల్లాల ఓదెలు

**మందమర్రి, జూన్ 23, ప్రభాతవార్త**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాద్‌లో మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూరు ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నల్లాల క్రాంతి, పీసీసీ కోఆర్డినేటర్ ప్రశాంత్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వర్ణ రైతు వేదికలో విత్తన మేళా సదస్సు

**సారంగాపూర్, జూన్ 23, ప్రభాతవార్త**

సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలో గల రైతు వేదిక భవనంలో మంగళవారం విత్తన మేళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బి. రాము మాట్లాడుతూ.. వానాకాలం పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు మేలైన వరి విత్తనాలను అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే రైతులు తమ పొలాల్లో సాగు చేయాలని సూచించారు. ఈ రకాలకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీలు, మద్దతు ధరలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం ఉన్నందున వాతావరణ పరిస్థితులకు తట్టుకునేలా ప్రభుత్వం సూచించిన విత్తనాలనే విత్తుకోవాలని ఆయన కోరారు. రైతులు తమ సాగు అవసరాలకు అనుగుణంగా ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, స్థానిక సర్పంచ్ మల్లేష్, ఉపసర్పంచ్, క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.



## గోదాం నిర్మాణ ప్రొసీడింగ్ కాపీ అందజేసిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

**భైంసా, జూన్ 22, ప్రభాతవార్త:**

తానూరు మండలంలోని మొగిలి గ్రామంలో నూతన గోదాం నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. భైంసా పట్టణంలోని తన నివాసంలో ముధోల్ మాజీ శాసనసభ్యులు గడ్డెన్నగారి విఠల్ రెడ్డి సోమవారం ఈ నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని మొగిలి గ్రామస్థులకు అందజేశారు. గ్రామంలో పంట నిల్వలకు ఉపయోగపడేలా గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగిలి గ్రామ సర్పంచ్ దర్శన్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ సర్పంచ్ పుండాలిక్, సుభాష్, ఎస్‌కే షాదుల్, ఏ. సాయినాథ్, పి. మోహన్, ఉపసర్పంచ్ నితిన్, ఎం. సాయినాథ్, పి. సాయిప్రసాద్, లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి







**హాజీపూర్, జూన్ 23, ప్రభాతవార్త**

మండలంలోని రైతు వేదికల్లో జరిగే విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ అన్నారు. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు హాజీపూర్ మండలంలోని అన్ని రైతు వేదికలలో విత్తన మేళ నిర్వహించడం జరుగుతుంది. గుడిపేట్ రైతు వేదికలో విత్తన మేళాను ఆత్మ చైర్మన్ సింగతి మురళి ప్రారంభించారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి విత్తనాలు బీపీటీ 5204, జైశ్రీరామ్, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, హెచ్ఎంటీ సోనా, కెఎన్ఎం 7715, డబ్ల్యూజిఎల్ 44, పత్తి, నానో డీఏపీ, నానో యూరియా స్టాళ్లు ఏర్పాటుచేయడం జరిగింది. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశంకల్పించబడింది. జాతీయ ఆహార భద్రత మిషన్ లో భాగంగా పప్పు దినుసులు ఐన కంది పంట మినికిట్స్ రైతులకి అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ ఏడిఏ క్రిష్ణ, హాజీపూర్ ఏఓ కృష్ణ, ఏఎంసి చైర్మన్ పద్మ ముని, హాజీపూర్ సర్పంచ్ మాధవరపు శ్రీలత, స్థానిక కార్పొరేటర్లు కమల శ్రీనివాస్ గౌడ్, లగిశెట్టి రాజన్న పాల్గొన్నారు.

**జన్నారం, జూన్ 23, ప్రభాతవార్త:**

జన్నారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఇన్‌ఛార్జ్ వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ అధ్యక్షతన సాగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, ఇన్‌ఛార్జ్ వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ మాట్లాడుతూ.. రైతులు తమ సాగులో నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను ఎంచుకోవడమే అధిక దిగుబడులు సాధించడానికి ప్రధాన మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సిఫార్సు చేసిన ఏడు రకాల ప్రత్యేక వరి వంగడాల విశిష్టతలను, వాటి సాగు పద్ధతులను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను సాగు చేయడం ద్వారా పంటలకు తెగుళ్ల ఉధృతి తగ్గుతుందని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని వారు స్పష్టం చేశారు. రైతులంతా ఈ నూతన వంగడాలపై అవగాహన పెంచుకుని ప్రయోజనం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరాయిపేట వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) అక్రమ్ ఉల్లా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసి ఉల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీరా నందు నాయక్, అలాగే మండలంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

**దిలావర్పూర్, జూన్ 23, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకుడు అనిల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం పంట సీజన్ ప్రారంభమైనందున రైతులు నాణ్యమైన విత్తనాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు సన్న రకాల వరి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. వాటిలో ముఖ్యంగా నాలుగు స్వల్పకాలిక రకాల ప్రత్యేకతలు, వాటి సాగు విధానాలను శాస్త్రీయంగా వివరించారు. వరితో పాటు కంది, సోయాబీన్, కూరగాయల విత్తనాల ప్రాధాన్యతను, అలాగే ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ పామ్ (ఆయిల్ పామ్) సాగు వల్ల రైతులకు కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. మరోవైపు ఈ విత్తన మేళా నిర్వహణ సమయంపై పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వానాకాలం సాగు కోసం ఇప్పటికే మెజారిటీ రైతులు బయట మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసి, నారుమడులు సిద్ధం చేసుకుని నారు పోశారని తెలిపారు. సాగు పనులు ముమ్మరంగా ప్రారంభమైన తర్వాత ఇలా విత్తన మేళా నిర్వహించడం వల్ల రైతులకు పెద్దగా ఉపయోగం ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, వ్యవసాయ శాఖ స్పందించి ఇటువంటి మేళాలను పంట సీజన్ ప్రారంభానికి కనీసం నెల రోజుల ముందే నిర్వహిస్తే.. రైతులు తమకు నచ్చిన విత్తనాలను ఎంపిక చేసుకుని లబ్ధి పొందే అవకాశం ఉంటుందని రైతులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

## పాఠశాలల బంద్ విజయవంతం

**తాండూర్, జూన్ 23, ప్రభాతవార్త :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ పిలుపులో భాగంగా మంగళవారం తాండూర్ మండలంలో పాఠశాలలు బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ బాగ్ కో కన్వీనర్ సిహెచ్ ఆనంద్, మండల కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం ఉప సంహరించుకోవాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో అధిక పీజీలను నియంత్రించాలన్నారు. విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డీఈవో, ఎంఈఓ, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పాఠశాల బందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.



## గ్రామాభివృద్ధిపై ప్రజలతో విస్తృత చర్చ

- **లైన్‌గూడ గ్రామసభలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం**
- **హరితహారం కింద మొక్కలు నాటిన అధికారులు**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని లైంగూడ గ్రామపంచాయతీలో మంగళవారం గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామసభలో గ్రామంలోని తాగునీటి సౌకర్యం, పారిశుద్ధం, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, హరితహారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై గ్రామస్తుల అభిప్రాయాలను సేకరించి, సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉజ్వల్ కుమార్, తహసీల్దార్ మధుకర్, డీఎల్‌పీఓ, సర్పంచ్ సర్పం రాంచందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, టీఏ కిషోర్, ఏఓ రామకృష్ణ, మిషన్ భగీరథ అధికారులు, ఉపసర్పంచ్ గోపాలరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు నిరంతర కఠిన చర్యలు: ఎస్సై

**దిలావర్పూర్, జూన్ 23, ప్రభాతవార్త:**




డ్రగ్స్ నిర్మూలనకు పోలీసు శాఖ నిరంతరం కఠిన చర్యలు చేపడుతోందని దిలావర్‌పూర్ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిరోధం, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు బానిసైన వారు జీవితంలో ఆశించిన స్థాయికి చేరుకోలేరని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చదువుపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండి సైబర్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ. నాగభూషణం, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**- డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ - బీజేపీ కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 23, ప్రభాతవార్త :**

జాతీయ ఏకత్వం, దేశ సమగ్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత, విద్యావేత్త డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశ సమగ్రత, జాతీయ ఐక్యత కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఖఒక దేశం – ఒక రాజ్యాంగంగ అనే భావనను దేశవ్యాప్తంగా బలంగా వినిపించిన మహోన్నత నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు ధోని శ్రీశైలం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత, చింతలమానేపల్లి మండల అధ్యక్షుడు డోకే రాము, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, కౌటాల మండల అధ్యక్షుడు కుంచల విజయ్తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు.